
సాక్షి సూర్యాపేట
బుధవారం ı 14 ı మే ı 2025



ఆకట్టుకోనున్న శిల్ప కళ
మిస్ వరల్డ్ పోటీదారులు గురువారం యాదగిరిగుట్టను దర్శించుకోనున్నారు. - 8లో



ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం
కోర్టులో స్వీపర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
42°/27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఖాకీకి అవినీతి మకిలీ!

పోలీస్ స్టేషన్‌లో ప్రతీ పనికి పోలీసుల వసూళ్లు

- బెయిల్ ఇవ్వాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..
- ఉన్నతాధికారులు వేటు వేస్తున్నా మారని తీరు
- ఈ ఏడాది ఇప్పటికే ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఎస్ఐలు, ఒక కానిస్టేబుల్
- తాజాగా సోమవారం సూర్యాపేట డీఎస్పీ, పట్టణ సీఐ కూడా..



సూర్యాపేటటౌన్ : జిల్లాలో కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది తీరుతో ఆ శాఖ అప్రతిష్టపాలవుతోంది. ఏదైనా కేసులో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కితే పైసలు ఇవ్వందే పని కాని పరిస్థితులు కనిపిస్తున్నాయి. న్యాయం చేయాల్సిన పోలీసులు ఇలా అడ్డదారులు తొక్కుతూ అవినీతి సొమ్ముకు కక్కుర్తి పడుతున్నారు. ఈ ఏడాది కాలంలో ఇప్పటికే ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎస్ఐలు ఏసీబీకి చిక్కారు. తాజాగా డీఎస్పీ, సీఐ ఏకంగా లక్షల్లో డిమాండ్ చేసి అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడడం కలకలం రేపుతోంది.

బెయిల్ ఇవ్వాలంటే..

నీతి, న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులు లంచాలు డిమాండ్ చేస్తూ ఆ శాఖకు చెడ్డపేరుతెస్తున్నారు. ఏదైనా కేసు అయితే స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటే రూ.వేలు, లక్షల్లో సదరు పోలీస్ అధికారికి ముట్టజెప్పాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల ఏసీబీ వలలో చిక్కిన పోలీస్‌ల తీరు చూస్తుంటే అలానే ఉంది. డబ్బులు ఇస్తేనే బెయిల్ ఇస్తామని, లేదంటే బెయిల్ ఇవ్వకుండా రిమాండ్‌కు పంపిస్తామని బెదిరింపులకు సైతం పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు ముట్టజెప్పాల్సి ఉంటుందని చెప్పడం గమనార్హం.

ఏసీబీకి చిక్కిన కేసులు..

- ఈ ఏడాది జనవరి 12న కోదాడ నుంచి తిరుమలగిరి మీదుగా డీసీఎంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వారు సిద్దిపేట జిల్లా వడ్డెపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ పేరు చెప్పడంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో చంద్రశేఖర్ పేరు తొలగించడానికి అప్పటి తిరుమలగిరి ఎస్ఐ సురేష్ రూ.3లక్షలు లంచం డిమాండ్ చేయగా చివరకు రూ.1.40లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో జనవరి 28న తిరుమలగిరి ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- గత ఏడాది అక్టోబర్‌లో పౌరసరఫరాల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి తన సిబ్బందితో కలిసి ఆరుగురిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఒక నిందితుడిని పిలిపించుకొని అరెస్టు చేయకుండా స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటే రూ.15వేలు డిమాండ్ చేసి రూ.10వేలకు ఒప్పందం చేసుకున్నాడు. ఈ విషయంలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులుఎస్ఐ అంతిరెడ్డిని ఏప్రిల్ 8న పట్టుకున్నారు.

విధుల్లో చేరిన కొద్దికాలంలోనే..

ఈ ఏడాది ఏప్రిల్ 2న సూర్యాపేట డీఎస్పీగా పార్థసారథి , ఆరు నెలల క్రితం సూర్యాపేట పట్టణ సీఐగా వీరరాఘవులు బాధ్యతలు చేపట్టారు. వీరు విధుల్లో చేరిన అతి తక్కువ కాలంలోనే అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికారు. జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోవడం.. ఇక్కడి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో హైదరాబాద్ నుంచి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం స్పందించింది. గత నెలలో సూర్యాపేటలోని పలు ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించగా అర్హత లేకుండానే కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు నడుపుతున్నట్లు నిర్ధారించింది. అర్హత లేకుండా డాక్టర్లుగా చలామణి అవుతున్న ఆపిల్ స్కానింగ్ సెంటర్, శ్రీ సాయిగణేష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, శ్రీ కృష్ణ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలంటూ ఐఎంఏ సభ్యులు గత నెల 29న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా నకిలీ డాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్టు చేయకుండా ఉండాలంటే రూ.25లక్షలు ఇవ్వాలని డీఎస్పీ, సీఐ డిమాండ్ చేయగా అంత ఇవ్వలేనని చెప్పడంతో కనీసం రూ.16లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితుడు నల్లగొండలోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ఆధారాలతో సోమవారం పట్టుకున్నారు.

హయత్ నగర్‌లో సోదాలు

హయత్‌నగర్‌లో డీఎస్పీ పార్థసారథి నివాసంలో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు చేసి అక్రమంగా ఉన్న 21 బుల్లెట్లను గుర్తించారు. దీనిపై అధికారులు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లనుసైతం అధికారులు గుర్తించినట్లు సమాచారం.

ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నా..

- ఇటీవల నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో చక్రయ్య అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సూర్యాపేట డీఎస్పీ రవిని డీజీపీ కార్యాలయానికి, తుంగతుర్తి సీఐ శ్రీనును జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేశారు.
- మట్టపల్లి చెందిన ఓ వ్యక్తి అమెరికాలో స్థిరపడ్డాడు. ఆ ఎన్నారై కారు మట్టపల్లిలోని ఆయన ఇంట్లో ఉందని తెలుసుకున్న ఎస్ఐ రామాంజనేయులు ఆయన సొంత అవసరాల కోసం వారం రోజుల పాటు కావాలని సంప్రదించి తీసుకున్నారు. రెండు నెలలవుతున్నా కారు ఇవ్వకపోవడంతో బాధితుడు పోలీస్ ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పలు అవినీతి ఆరోపణలతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐని సస్పెండ్ చేశారు.
- గత ఏడాది తుంగతుర్తి, పెన్‌పహాడ్, ఆత్మకూర్.ఎస్‌లలో పని చేస్తున్న ముగ్గురు ఎస్ఐలు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని వీఆర్‌కు అటాచ్ చేశారు. ఇలా ఇంకా కొంత మంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నా వారి తీరు మారకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



మట్టపల్లి క్షేత్రంలో కొనసాగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కృష్ణా నదిలో హంస వాహనంపై విహరించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించొద్దు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నాగారం: ధాన్యం కొనుగోళ్లలో ఐకేపీ నిర్వాహకులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హెచ్చరించారు. మంగళవారం నాగారం మండల పరిధిలోని వర్థమానుకోట, నాగారంబంగ్లా గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలను పరిశీలించి మాట్లాడారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి కాంటాలు వేయాలని ఆదేశించారు. కాంటాలు అయిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిల్లుల వద్ద మిల్లర్లు సకాలంలో ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులకు సూచించారు. మిల్లర్లు ధాన్యం దిగుమతుల్లో అలసత్వం వహించవద్దన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే ట్రక్‌షీట్లను, ట్యాబ్ ఎంట్రీ, రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, డీఎంసీఎస్ ప్రసాద్, ఏఓ కృష్ణకాంత్, ఆర్ఐ అల్లాఉద్దీన్, ఏపీఎం శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద

చివ్వెంల(సూర్యాపేట) : కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గం అని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద అన్నారు. జూన్ 14న లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసుల పరిష్కారంలో పోలీసులు, జ్యుడీషియల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని, సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఉంచాలన్నారు. ఇప్పటికే జిల్లాకు కేసుల పరిష్కారంలో మంచి పేరు ఉందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న ఘర్షణలకే కోర్టుల మెట్లు ఎక్కుతున్నారని, దీనివల్ల కాలం, ధనం, వృథా అవుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంకు, మోటర్ వెహికిల్, విద్యుత్, ఎక్సైజ్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.వెంకటరమణ, ఏఎస్పీలు నాగేశ్వర్ రావు, అప్పారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకర బోయిన రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆధారాలు పక్కాగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటటౌన్ : కేసుల దర్యాప్తులో సాక్షా ధారాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అధికారులకు సూచించారు. కేసుల్లో శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి కోర్టు, పోలీసు శాఖ సమన్వయంపై మంగళవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల్లో నిందుతులను దోషులుగా నిరూపించి శిక్షలు పడేలా దర్యాప్తు పక్కాగానైపుణ్యంతో చేయాలని అధికారులకు సూచించారు. కోర్టు అధికారులతో సమన్వయంతో పని చేయాలని, సాక్షులను, నిందితులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పర్చాలని పేర్కొన్నారు. నేరగాళ్లకు శిక్షలు పడేలా పని చేయడంలో దర్యాప్తు అధికారికి ఎంత బాధ్యత ఉంటుందో కోర్టు డ్యూటీ సిబ్బందికి కూడా అంతే బాధ్యత ఉంటుందన్నారు. కేసులు పెండింగ్ లేకుండా దర్యాప్తును సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ సీజ్



ఆపిల్ స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఆపిల్ స్కానింగ్ సెంటర్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం మంగళవారం సీజ్ చేశారు. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేయగాస్కానింగ్ సెంటర్‌ను నకిలీ డాక్టర్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. నివేదికను కలెక్టర్, డీఎంహెచ్‌ఓకు సమర్పించారు. విచారణ చేపట్టిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేశారు.

ప్రశాంతంగా పాలిసెట్



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌ను పరిశీలిస్తున్న పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో పాలిసెట్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఏ, బీ సెంటర్ లు, ఎస్వీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్కేఎల్‌కే డిగ్రీ, పీజీ కళాశాల, శ్రీ మేధా జూనియర్ కళాశాల, శ్రీనిధి జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. 1436 మంది బాలురు, 1362 బాలికలు మొత్తం 2798 మంది దరఖాస్తు చేసుకున్నారు.1330 మంది బాలురు, 1260 మంది బాలికలు మొత్తం 2,590 హాజరు కాగా, 106 మంది బాలురు, 102 బాలికలు మొత్తం 208మంది గైర్హాజరైనట్టు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ కె. సుజాత తెలిపారు.

హనుమంతుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

నాగార్జునకొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



చైత్య స్థూపం వద్ద బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్: బెంగళూరు సారా బౌద్ధవిహార్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు మంగళవారం నాగార్జునకొండను సందర్శించారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా నవాంగ్ జుంగ్నే బౌద్ధ గురువు ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌కు వచ్చారు. ఈ బృందం మొదటగా బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుని వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసింది. టూరిజం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ పురావస్తు మ్యూజియాన్ని సందర్శించింది. నాగార్జునకొండపైన సింహళవిహారం, మహాస్థూపం చైత్యాలు, అలనాటి శవపేటికలు తదితర ప్రాంతాలను భిక్షువులు తిలకించారు. బోధి వృక్షం కింద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పైరవీలతో పదవులు రావు



మాట్లాడుతున్న టీపీసీసీ పరిశీలకుడు మురళీనాయక్, చిత్రంలో ఎమ్మెల్యే సామేల్, డీసీసీ అధ్యక్షుడు

- టీపీసీసీ పరిశీలకుడు మురళీనాయక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : 'కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకే పదవులు వస్తాయి.. పైరవీలతో పదవులు రావు' అని టీపీసీసీ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం తిరుమలగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల పాలనలో ఇసుక మాఫియా, భూ మాఫియా సాగిందని పేర్కొన్నారు. మండల శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ శాఖల అధ్యక్షుల పదవుల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో 2017 సంవత్సరం కన్నా ముందున్న వారు, ఎన్నికల్లో గెలుపు కోసం పోరాడినవారు అర్హులవుతారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర : మందుల సామేల్, ఎమ్మెల్యే.

త్యాగాల చరిత్ర కాంగ్రెస్ పార్టీకే ఉందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ అబ్జర్వర్ శత్రురావు, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ, పీసీసీ అధికార ప్రతినిధి జ్ఞానసుందర్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు వై.నరేష్ ,యోగానందాచార్యులు, పాల్వాయి నాగరాజు, వివేక్‌రెడ్డి, కృష్ణప్రసాద్, పాలకుర్తి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న కార్యకర్తలతో మాట్లాడుతున్న మురళీనాయక్

సమావేశం ముగిసిన తరువాత టీపీసీసీ పరిశీలకుడు మురళీనాయక్, డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ కార్ల ముందు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు కోసం 30 సంవత్సరాలుగా కృషి చేశామని, తమకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో తమపై వందలాది కేసులు అయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మురళీనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

భూ భారతి దరఖాస్తులు 1,690

- పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గరిడేపల్లి మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు
- రైతుల నుంచి అనూహ్య స్పందన
- అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లపై 731 దరఖాస్తులు.. అత్యల్పంగా డిజిటల్ సంతకం పెండింగ్‌పై ఆరు..
- వచ్చేనెల 1లోగా సమస్యలు పరిష్కరించేలా ప్రణాళిక



తాళ్లమల్కాపురంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్(ఫైల్)

మిస్సింగ్ సర్వే నంబర్లు	731
పెండింగ్ మ్యుటేషన్	26
డిజిటల్ సంతకం పెండింగ్	06
విస్తీర్ణంలో తేడాలు	73
పేర్లలో తప్పుల సవరణ	07
ప్రొహిబిటెడ్ ల్యాండ్	46
అసైన్డ్‌ల్యాండ్	196
పౌతి	69
సాదాబైనామా	130
ఇతర సమస్యలు	406

గరిడేపల్లి: భూ భారతి చట్టం కింద గరిడేపల్లి మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు అనూహ్య స్పందన లభించింది. ఈనెల 5 తేదీన ప్రారంభమైన ఈ సదస్సులు 12వతేదీతో ముగిశాయి. ఇందులో రైతులు వివిధ సమస్యలపై మొత్తం 1,690 దరఖాస్తులు అందించారు. వీటిలో అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 731, అత్యల్పంగా డిజిటల్ సంతకం పెండింగ్‌పై ఆరు దరఖాస్తులు వచ్చాయి.

త్వరలో క్షేత్రస్థాయిలో విచారణ

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద గరిడేపల్లి మండలాన్ని ప్రకటించారు. ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు తహసీల్దార్ బండ కవిత, డీఏఓ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సదస్సులను కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబుతో పాటు పలువురు అధికారులు పర్యవేక్షించారు. 1,940 మంది రైతులకు దరఖాస్తు ఫారాలు అందించారు. అయితే 1,690 మంది రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందించారు. రైతులకు సహకారం అందించేందుకు ఆయా గ్రామాల్లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి రెవెన్యూ సిబ్బంది దగ్గర ఉండి దరఖాస్తులను నింపి ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి జూన్ 1వ తేదీలోగా దరఖాస్తులు పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించారు.

రెవెన్యూ గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులు

తాళ్లమల్కాపురంలో 73, రాయినిగూడెం 140, కాల్వపల్లి 50, గడ్డిపల్లి 61, గరిడేపల్లి 193, కుతుబ్ షాపురం 140, గానుగబండ 69, వెలిదండ 269, సర్వారం 118, పొనుగోడు 321, కల్మలచెర్వు 256 దరఖాస్తులు వచ్చాయి.

జూన్ 1లోగా సమస్యలు పరిష్కరిస్తాం



గడిడేపల్లి మండలంలో భూ భారతి చట్టం కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం ఐదు టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో విచారణ చేయనుంది. ఈ సమస్యలను జూన్ 1వ తేదీలోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా కలెక్టర్ ఎంపిక చేసి సదస్సులు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– బండ కవిత, తహసీల్దార్

అర్హత లేనివారు వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

భానుపురి (సూర్యాపేట) : అర్హత లేని వారు వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హెచ్చరించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి .రాంబాబు తో కలిసి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ, టీజీఎంసీ, ఐఎంఏ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జయ మనోహరి, పీఎంహెచ్ యన్ డాక్టర్ అనితరాణి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ దయాకర్ రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ ఆనంద్ గాంబ్లె, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ అనూష, టీజీఎంసీ సభ్యుడు రాజీవ్ నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం పిపల్‌పహాడ్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిపల్‌పహాడ్ గ్రామానికి చెందిన యువతి(21) డిగ్రీ ఫైనలియర్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటోంది. సోమవారం ఆమె తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం యువతి తండ్రి ఇంటికి వచ్చేసరికి ఆమె ఇంట్లో కనిపించలేదు. వెంటనే భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె ఇంటికి వచ్చి చుట్టుపక్కల ఇళ్లలో, బంధువుల ఇళ్లలో వెతికినా కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లొస్తూ..

భువనగిరిటౌన్: బొమ్మలరామారం మండలం పీజీ తండాకు చెందిన ధీరావత్ స్వరూప భువనగిరిలోని డెంటల్ ఆస్పత్రికి వచ్చి కనిపించకుడా పోయిందని ఆమె భర్త బాల్లి మంగళవారం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్వరూప తన కుమారుడితో కలిసి ఈ నెల 12వ తేదీన భువనగిరిలో డెంటల్ ఆస్పత్రికి వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్‌కు చేరుకున్నారు. మూత్రవిసర్జనకు వెళ్లి వస్తానని కుమారుడికి చెప్పిన స్వరూప కనిపించకుండా పోయింది. బాలుడు తన తండ్రికి సమాచారం ఇచ్చాడు. ఎంత వెతికినా స్వరూప ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి


సహస్ర (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక సోమవారం సాయంత్రం మృతి చెందింది. యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన సొన్నాయిల రమేష్, కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. రెండో కుమార్తె సహస్ర (13) ఆరో తరగతి పూర్తిచేసింది. నాలుగు రోజులుగా జర్వంతో బాధపడుతున్న సహస్రను కుటుంబ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందింది. సహస్ర మృతదేహానికి మంగళవారం డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి నివాళులర్పించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భువనగిరిటౌన్: భువనగిరి బస్టాండ్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన ఇమ్రాన్‌ఖాన్ నాగ్‌పూర్ నుంచి తెచ్చిన గంజాయిని భువనగిరిలో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అతడిని పట్టుకుని విచారించగా 0.138 గ్రాముల గంజాయి లభించిందని పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎండల్లో హాయ్.. హాయ్..


సూర్యాపేటలో స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు


నల్లగొండ ఇండోర్ స్టేడియం పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

- స్విమ్మింగ్ పూల్స్‌లో ఈత నేర్చుకుంటూ సరదాగా గడుపుతున్న చిన్నారులు
- ఆత్మరక్షణ కోసం పిల్లలకు ఈత నేర్పిస్తున్నామంటున్న తల్లిదండ్రులు

సమ్మర్ స్పెషల్

సూర్యాపేట అర్బన్, నల్లగొండ టూటౌన్: వేసవి సెలవులను వృథా చేయకుండా చిన్నారులు ఏదో ఒక సాధనలో నిమగ్నమయ్యారు. కొందరు వేసవి క్రీడా శిబిరాలకు వెళ్లి తమకు ఇష్టమైన ఆటల్లో మెలకువలు నేర్చుకుంటుంటే, కొందరు అమ్మమ్మ వాళ్ల ఊళ్లకు చెరువులు, బావుల్లో ఈత నేర్చుకుంటున్నారు. పట్టణాల్లో ఉండే చిన్నారులు స్విమ్మింగ్ పూల్స్‌లో ఈత నేర్చుకుంటూ వేసవి సెలవులను సరదాగా గడుపుతున్నారు. సూర్యాపేట పట్టణంలోని కుడకుడ రోడ్డులో గల శివం స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 7.30గంటల నుంచి రాత్రి 8గంటల వరకు చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఈత నేర్చుకుంటున్నారు. యువకులు కూడా వేసవి తాపానికి తాళలేక సాయంత్రం వేళ స్విమ్మింగ్ పూల్‌కు వచ్చి ఈత కొడుతున్నారు. ఉదయం 30 నుంచి 40 మంది, సాయంత్రం 60 నుంచి 70 మంది పిల్లలు ఈత నేర్చుకోవడానికి వస్తున్నారు. గంటకు రూ.80 నుంచి రూ.100 చెల్లిస్తున్నారు. నెల రోజులకు అయితే ఒక్కొక్కరికి రూ.2,000 వరకు స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు తీసుకుంటున్నారు. ప్రతిరోజు సాయంత్రమయ్యేసరికి ఈత కొలను చిన్నారులతో కళకళలాడుతూ కనిపిస్తోంది. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో గల స్విమ్మింగ్ పూల్‌లో సైతం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులు, చిన్నారులు వచ్చి స్విమ్మింగ్ నేర్చుకుంటున్నారు.

ట్యూబ్‌లతో సాధన

స్విమ్మింగ్ పూల్స్‌లో చిన్నారులు ట్యూబ్‌ల సహాయంతో ఈత సాధన చేస్తున్నారు. సూర్యాపేటలోని స్విమ్మింగ్ పూల్‌లో వీరికి శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు శిక్షకులను సైతం పూల్ నిర్వాహకులు నియమించారు. అదేవిధంగా ఇద్దరు అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. వీరు నిరంతరం పిల్లలు ఈత కొట్టే విధానాన్ని, ఎవరూ పూల్‌లో మునిగిపోకుండా పర్యవేక్షిస్తూ ఉంటారు. అదేవిధంగా దుస్తులు మార్చుకోవడానికి నాలుగు గదులు కూడా ఏర్పాటు చేశారు.


నల్లగొండలో ట్యూబ్‌ల సహాయంతో ఈత నేర్చుకుంటున్న బాలికలు

ఆత్మరక్షణ కోసం నేర్చుకుంటున్నా



ఆత్మరక్షణ కోసం సూర్యాపేటలోని కుడకుడ రోడ్డులో గల శివం స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్నాను. 15 రోజుల నుంచి ఇక్కడకు వస్తున్నాను. మొదట గాలి ట్యూబ్ సహాయంతో ఈత కొట్టాను. ప్రస్తుతం కొంచెం కొంచెంగా ట్యూబ్ లేకుండా ఈత కొట్టగలుగుతున్నా. – సూర్యతేజ్

ఎంతో సరదాగా ఉంది



వేసవి సెలవుల్లో ఈత నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది.. నేను 20 రోజులుగా స్విమ్మింగ్ పూల్‌కు వచ్చి మా నాన్న సహాయంతో ఈత నేర్చుకుంటున్నాను. ఈ వేసవి సెలవులు అయిపోయే లోపు ఈత నేర్చుకుంటా. ఎండ వేడికి స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టడం భలే సరదాగా ఉంది. – వేదశ్రీ

ఈత వల్ల ఎన్నో లాభాలు



చిన్నపిల్లలకు ఈత నేర్పడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చెరువులు, బావుల దగ్గరికి వెళ్లినప్పుడు వాటిల్లో మునిగిపోకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఈతరాక అనేక మంది పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈత కొట్టే పిల్లలు శారీరకంగా కూడా ధృఢంగా ఉంటారు. పిల్లలకు ఈత నేర్పడం చాలా అవసరం.
– లక్కరాజు ప్రవీణ్, స్నేహనగర్, సూర్యాపేట



జలకాలాటలో బాతులు

మేళ్లచెరువు పరిధిలోని చెరువు కందకంలో బాతులు జలకాలాడుతూ కనువిందు చేస్తున్నాయి. బాతులు చెరువులో ఆహార వేటతో పాటు నీటిలో అటూ ఇటూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతూ కనిపించాయి. – హుజూర్‌నగర్

కార్మిక రంగం బలోపేతానికి కృషి చేయాలి

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నాంపల్లి: కార్మిక రంగం బలోపేతానికి కేంద్రం కృషిచేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలం వడ్డెపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సీపీఐ 15వ మండల మహాసభకు ఆయన హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు మద్దతు ధర కల్పించేందుకు గాను చట్టం తేచ్చేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికే రూ.లక్ష కోట్లు కేటాయించిందని, డిండి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికే రెండు సార్లు సమావేశం ఏర్పాటు చేసి డిండి ఎత్తిపోత పథకానికి నిధులు కేటాయించి ఈ ప్రాంతానికి సాగునీరు అందించే ప్రయత్నం చేసిందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎనుకున్నారు. మండల కార్యదర్శిగా మూడోసారి ఏకగ్రీవంగా సూదనబోయిన రమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాగిపాణి ఆంజాచారి, రమేష్, జగన్, గిరి, రమా, కోరె సత్తయ్య, మహేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలుచేయడం లేదన్నారు. ఈ సమావేశంలో నకిరేకల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, ఆయా సంఘాల నాయకులు బొజ్జ చినవెంకులు, వంటేపాక వేంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, సింగం రేణుక, ఉయ్యాల సైదులు, గోర్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం జీత వ్యత్యాసాన్ని సరిచేసేందుకు చర్చలు


టీఆర్‌వీకేఎస్ జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకుడు కరెంట్‌రావు తదితరులు

హుజూర్‌నగర్: విద్యుత్ సంస్థలోని 2023 బ్యాచ్ జేఎల్‌ఎం జీత వ్యత్యాసాన్ని సరిచేసేందుకు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం(టీఆర్‌వీకేఎస్) రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీజీఎస్‌పీడీసీఎల్ కార్యదర్శి పి. కరెంట్‌రావు తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్ విద్యుత్ డివిజన్ ఆధ్వర్యంలో మే డే పక్షోత్సవాలలో భాగంగా డీఈ కార్యాలయం ముందు యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్‌ల కన్వర్షన్ కోసం యూనియన్ కృషిచేస్తుందని అన్నారు. త్వరలో జరగబోయే సబ్ ఇంజనీర్ స్క్రీనింగ్ టెస్ట్ కూడా మల్టీపుల్ ఛాయిస్‌లో ఇచ్చే విధంగా యాజమాన్యంతో మాట్లాడతామని చెప్పారు. ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి. రమేష్‌బాబు, పి. మల్లికార్జున్, బి. విశ్వనాథచారి పాల్గొన్నారు.

కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- ఇద్దరి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి: నల్లగొండ కోర్టులో స్వీపర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసి నిరుద్యోగ యువతను మోసం చేసిన ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఎండీ నసీర్ నల్లగొండ కోర్టులో అడ్వకేట్ క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. అదే కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న గాజుల జ్యోతి, నసీర్ కలిసి కోర్టుకు వచ్చే నిరుద్యోగ యువతకు కోర్టులో స్వీపర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి 31 మంది నుంచి రూ.10.32లక్షలు వసూలు చేశారు. తాను మోసపోయినట్లు గ్రహించిన తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన ఏపూరి హెబ్సిబా ఈ నెల 7వ తేదీన తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో వీరిద్దరిపై ఫిర్యాదు చేసింది. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు నిందుతులిద్దరిని మంగళవారం అదుపులో తీసుకున్నారు. వీరిపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో 4 కేసులు, నల్లగొండ వన్ టౌన్‌లో 3 కేసులు మొత్తం 7 కేసులు నమొదయ్యాయి. వీరి నుంచి 2 సెల్‌ఫోన్లు, బైక్, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్, పోలీస్ సిబ్బందిని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్, ఏఎస్ఐ లింగయ్య, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజీవ్, రాంరెడ్డి, నాగరాజు, సూరిబాబు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన డీలర్ సస్పెన్షన్

అనంతగిరి: అక్రమాలకు పాల్పడిన అనంతగిరి మండలం ఖానాపురం రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేసినట్లు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. ఖానాపురంలోని కొన్ని కుటుంబాల్లో చనిపోయిన వ్యక్తుల పేర్లను రేషన్ జాబితా నుంచి తొలగించలేదని, వారి పేరిట రేషన్ బియ్యాన్ని డీలర్ గోల్‌మాల్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు అనంతగిరి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో సదరు డీలర్‌పై విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం ఖానాపురం గ్రామంలో విచారణ చేపట్టారు. పలు కుటుంబాల్లో చనిపోయిన ఏడుగురి పేరిట డీలర్ అక్రమంగా రేషన్ బియ్యం తీసుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు. విచారణ కొనసాగుతోందని, త్వరలో విచారణ పూర్తిచేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా రేషన్ దుకాణంలో ఉండాల్సిన సన్న బియ్యం 70 కేజీలు తక్కువగా ఉండటంతో డీలర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి, మరో డీలర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

దివిస్ ఫార్మా కంపెనీపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పరిధిలోని దివిస్ ఫార్మా కంపెనీపై చౌటుప్పల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని నేలపట్ల గ్రామానికి చెందిన పలువురు రైతుల భూముల్లో నుంచి దివిస్ పరిశ్రమ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసకోకుండా పైపులైన్లు వేశారు. దీంతో బాధిత రైతులు తడక నర్సింహ, తడక పద్మభూషి, తడక రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరిశ్రమ అధికారులు శివప్రసాద్, పెండ్యాల సుధాకర్‌తో పాటు కాంట్రాక్టర్ రవితేజపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

లంబాడీ భాషలో పెళ్లి పత్రిక

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధనావత్ మక్లానాయక్ కుమార్తె వివాహం ఈ నెల 23న మిర్యాలగూడలో జరగనుంది. అయితే, తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను మక్లానాయక్ లంబాడీ భాషలో ముద్రించి బంధుమిత్రులకు అందజేశారు. లంబాడీ భాషను తెలుగు అక్షరాలతో ముద్రించారు.


లంబాడీ భాషలో ముద్రించిన పెళ్లి పత్రిక

నకిలీ బంగారం అంటగట్టి మోసం

- రూ.3లక్షలు నష్టపోయిన రైతు

మేళ్లచెరువు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన రైతుకు నకిలీ బంగారం అంటగట్టి మోసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన ఇరిగెల శంభిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కొంతకాలంగా శంభిరెడ్డి వ్యవసాయ బావి సమీపంలో ఉంటూ పిట్టలు పట్టి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శంభిరెడ్డితో వారికి పరిచయం పెరిగింది. కొద్దిరోజుల తర్వాత వారు ముగ్గురు తమ సొంతూరుకు వెళ్లారు. అయితే 15 రోజుల క్రితం శంభిరెడ్డికి ఆ ముగ్గురు వ్యక్తులు ఫోన్ చేసి తమ బంధువుల పొలం చదును చేస్తుండగా లంకెబిందెలు దొరికాయని, అందులోని బంగారం ఎక్కడ అమ్మాలో తెలియడం లేదంటూ బంగారం ఉన్న వీడియోను శంభిరెడ్డికి చూపించారు. డబ్బులు తీసుకొని వస్తే బంగారం ఇస్తామని శంభిరెడ్డిని హిందూపురానికి పిలిపించుకున్నారు. మొదట కొంత బంగారం ఇచ్చి అది మంచిదో కాదో చెక్ చేసుకొని డబ్బుతో తిరిగిరావాలని శంభిరెడ్డికి చెప్పారు. అది నిజమైనదే కావడంతో శంభిరెడ్డి రూ.3లక్షలు ఇచ్చి మరింత బంగారం తీసుకొని వచ్చాడు. ఇంటికి వచ్చి బంగారాన్ని పరీక్షించగా అది నకిలీదని తేలడంతో బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

భువనగిరిటౌన్: డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను భువనగిరి పట్టణంలోని నల్లగొండ క్రాస్ రోడ్ వద్ద మంగళవారం పోలీసులు, బజరంగ్‌దళ్ నాయకులు పట్టుకున్నారు. ఏపీలోని కాకినాడ నుంచి డీసీఎంలో 16 గోవులను ఎక్కించి వాటి పైనుంచి కొబ్బరి పొట్టు కప్పి హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయాలని, గోరక్ష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బజరంగ్‌దళ్ భువనగిరి పట్టణ కన్వీనర్ నెమల నవీన్ కోరారు.

సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేథా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 6 నెలల కాలవ్యవధి కల్గిన ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా ఏదేని డిప్లమా పాసై ఉండాలని అన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ అండ్ సీసీ టీవీ టెక్నిషియన్ కోర్సుకు పదవ తరగతి విద్యార్హత కల్గి ఉండాలని అన్నారు. అలాగే టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కూడా కల్పించబడుతుందని అన్నారు. అంతేకాక శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. అయితే అభ్యర్థులు 18 నుంచి 25 సంవత్సరాల మధ్య మయస్సు కల్గి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 16న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావలెయునని తెలిపారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా నిత్య కల్యాణం


నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, దీపాలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకోనున్న శిల్ప కళ

- రేపు యాదగిరిగుట్టకు రానున్న సుందరీమణులు

యాదగిరిగుట్ట : హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాలకు చెందిన 10మంది సుందరీమణులు గురువారం యాదగిరిగుట్టను దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా నల్లరాతి శిల్పాలతో అద్భుతంగా రూపుదిద్దుకున్న యాదగిరీశుడి ఆలయాన్ని అందాల భామలు పరిశీలించి ఇక్కడే ఫొటో షూట్ నిర్వహించనున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా డాక్యుమెంటరీ చిత్రీకరించి విశ్వ వ్యాప్తంగా యాదగిరి క్షేత్ర ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎటు చూసినా ఆధ్యాత్మిక భావనే..

యాదగిరిగుట్ట ప్రధాన ఆలయంలో ఎటూ చూసినా అద్భుత దృశ్యాలు కనువిందు చేస్తాయి. తూర్పు రాజగోపుర మహాద్వారం నుంచి ఆలయంలోని ప్రవేశించినప్పటి నుంచి సుందరీమణులను గొప్ప ఆధ్యాత్మిక వాతావరణంలోకి తీసుకెళ్లనుంది. ప్రధాన ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే క్రమంలో మెట్లకు ఇరువైపులా గల శంకు చక్ర నామాలు, దశావతారాలు, హనుమంతుడు, గరుడ్మంతుడు, పంచ నారసింహులు, రామానుజులు, యాదవ మహర్షి, ప్రహ్లాదుడు, మహా విష్ణువు, అష్టలక్ష్మి శిల్పాలతో ఆలయానికి ప్రత్యేక కళ వచ్చింది. మెట్లదారికి ఇరువైపులా చిన్న చిన్న ఏనుగు బొమ్మలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఇన్నర్, ఔటర్ ప్రాకారాల్లో ఏర్పాటు చేసిన యాలీ పిలర్లు, అష్టభుజి ప్రాకారాలు, సాలహారాల్లో పొందుపర్చిన దేవతామూర్తుల విగ్రహాలు, గర్భాలయం ముఖ మండపంపై ప్రహ్లాద చరిత్ర ఘట్టాలను పంచలోహ శిల్పాలు సుందరీమణులను ఆకట్టుకోనున్నాయి. ఆలయంలోని ప్రతి పిల్లర్‌కు ఒక్కో ఆళ్వారుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పెరి ఆళ్వార్, పెగయ్ ఆళ్వార్, భూదత్ ఆళ్వార్, మధురకవి ఆళ్వార్, తిరుమంగై ఆళ్వార్, తిరుప్పాన్ ఆళ్వార్, నంబి ఆళ్వార్, పే ఆళ్వార్, కులసేఖర్ ఆళ్వార్, తిరుమంగై ఆళ్వార్, తొండర పొడియా ఆళ్వార్, ఆండాల్ అమ్మవార్ల విగ్రహాలు, ఆళ్వార్ పిల్లర్ల పైన కాకతీయ శైలితో స్తంభాలను నెలకొల్పిన తీరు అందాల భామలను కనువిందు చేయనున్నాయి.


తూర్పు మాడ వీధిలో బ్రహ్మోత్సవ మండపం, తూర్పు రాజగోపురం


ఆలయ ప్రాకార మండపంలో ఏర్పాటు చేసిన యాలీ పిల్లర్లు


పశ్చిమ మహా రాజగోపురం ముందు ఏర్పాటు చేసిన ఏనుగుల బొమ్మలు